సాక్షి
అన్నమయ్య జిల్లా
బుధవారం । 1 । అక్టోబర్ । 2025




దేదీప్యమానం.. దేవీ వైభవం


జిల్లాలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. ఎనిమిదో రోజైన మంగళవారం జగన్మాత ఒక్కో ప్రాంతంలో ఒక్కో అలంకారంలో దర్శనమిచ్చి, భక్తులను అనుగ్రహించారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలోని పెద్దతిప్ప సముద్రంలో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు. జగజ్జనని వైభవం దేదీప్యమానంగా వెలుగొందుతోంది. –పెద్దతిప్పసముద్రం

పేదల ఇళ్లపై పిడుగు

- నిర్మించలేదన్న నెపంతో 21,195 గృహాలు రద్దు
- ఆన్‌లైన్‌లో వివరాల తొలగింపు
- తాజాగా మరిన్ని రద్దు చేసేందుకు నిర్ణయం
- కూటమి తీరుపై మండిపడుతున్న లబ్ధిదారులు



కురబలకోట మండలం కంటేవారిపల్లెలో జగనన్న లేఔట్‌లో అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలు



మదనపల్లె: పేదల ఇళ్లపై పిడుగు పడింది. కూటమి ప్రభుత్వం నిరుపేదలపై పగబట్టిందా.. అన్నట్లుగా వ్యవహరిస్తోంది. ఆర్థిక స్థోమత లేక కట్టుకునేందుకు ముందుకు రాని వారి ఇళ్లను రద్దు చేసే పనిలో నిమగ్నమైంది. పేదలకు అవసరమైనన్ని గృహాలను మంజూరు చేసి అండగా నిలవాల్సిన సర్కారు.. ఇలా వ్యవహరిస్తుండటంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. అన్నమయ్య జిల్లాలో ఇప్పటికే కొన్ని పక్కా గృహాలను రద్దు చేసేసింది. తాజాగా మరిన్ని గృహాలను రద్దు చేయాలని మంగళవారం నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వం ఆదేశించింది. దీంతో నిర్మాణానికి నోచుకోని గృహాలను వెతికే పనిలో గృహ నిర్మాణ శాఖ అధికారులు పడ్డారు. ఇంకెన్ని గృహాలు రద్దవుతాయో, ఆ లెక్కలేమిటో తేల్చనుంది ప్రభుత్వం. కూటమి తీరుపై లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికే 21,195 ఇళ్లు రద్దు

జిల్లాలో 2019–20లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఒక్కో నియోజకవర్గానికి 2–3 వేలలోపు ఇళ్లు మంజూరు చేశారు. 2021–22 నుంచి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విరివిగా పేదలకు ఇళ్లు మంజూరు చేశారు. అర్హులైన ప్రతి నిరుపేదకు ఇంటి స్థలం, పక్కా గృహ నిర్మాణానికి తిరిగి చెల్లించనవసరం లేని రూ.1.80 లక్షల ఆర్థిక సాయం అందించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జిల్లాకు 78,221 పక్కా గృహాలు మంజూరు చేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఈ మొత్తం గృహాల్లో 21,195 పక్కా గృహాలను రద్దు చేసేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో కేటాయించిన పక్కా గృహాలు ఉండగా.. అవి తక్కువ సంఖ్యలో ఉన్నాయి. రద్దు చేసిన పక్కా గృహాల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంజూరైనవే అధికం.

అప్పట్లో హడావిడిగా..

జిల్లాలో పేదలకు గత టీడీపీ హయాంలో 2019–20లో ఎన్నికల సమయంలో హడావిడిగా ఇళ్లు మంజూరు చేశారు. ఆ ఇళ్ల నిర్మాణాలు ఒక్క అడుగు ముందుకు పడలేదు. ఇళ్ల నిర్మాణాలు మొదలైనట్లు అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో.. లబ్ధిదారుల ఖాతాల్లో ఒక రూపాయి వేశారు. తర్వాత పైసా బిల్లు ఇవ్వలేదు. దానికితోడు బీబీఎల్ స్థాయిలో ఇళ్ల నిర్మాణాలు మొదలైనట్లు నమోదు చేసిన అధికారులు.. దానికి సంబంధించిన బిల్లును కూడా అప్పటి ప్రభుత్వం ఇవ్వలేదు. ఫలితంగా ఈ పేదలందరూ ఇంటి నిర్మాణాలకు దూరమయ్యారు. ప్రస్తుతం ఈ ఇళ్లు కూడా రద్దు జాబితాలో ఉన్నాయి.

రద్దు చేసిన పక్కా గృహాలు

నియోజకవర్గం	ఇళ్ల సంఖ్య
మదనపల్లె	4,824
పీలేరు	3,613
రైల్వేకోడూరు	4,185
రాజంపేట	3,586
రాయచోటి	2,826
తంబళ్లపల్లె	2,161

ఆన్‌లైన్‌లో తొలగింపు



పక్కా గృహాలను రద్దు చేస్తున్న కూటమి ప్రభుత్వం వాటి వివరాలను గృహనిర్మాణశాఖ వెబ్‌సైట్ నుంచి ఆగమేఘాల మీద తొలగిస్తోంది. క్షేత్ర స్థాయి నుంచి ఫలానా పేదలకు మంజూరైన పక్కా గృహం నిర్మాణం ఇంకా చేపట్టలేదని, వాటి వివరాలను పంపిన వెంటనే వెబ్‌సైట్ నుంచి తొలగించేస్తున్నారు. దీంతో లబ్ధిదారుల సంఖ్య భారీగా తగ్గిపోతోంది. మంగళవారం ప్రభుత్వం నుంచి అందిన సూచన ప్రకారం మరిన్ని పక్కాగృహాల రద్దుకు వివరాల సేకరణ మొదలైంది.

నిర్మాణం లేనివే

జిల్లాలో పక్కా గృహాలను నిర్మించుకోని లబ్ధిదారుల ఇళ్లను మాత్రమే రద్దు చేస్తున్నారు. పీఎంఏవై కింద తొలివిడత మంజూరైన ఇళ్ల ప్రక్షాళన కోసం ప్రభుత్వం ఈ చర్య చేపట్టింది. పీఎంఏవై ఇళ్ల పథకం ఈ డిసెంబర్ నాటికి ముగుస్తుంది. అందుకనే ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

–రమేష్‌రెడ్డి, హౌసింగ్ పీడీ

మెడికల్ ప్రైవేటీకరణపై దళిత గర్జన

- ప్రభుత్వ వైద్య కళాశాలలు ప్రైవేటుపరం చేయడంపై నిరసన
- వైఎస్‌ఆర్‌సీపీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో ఆందోళన
- కూటమి సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు
- అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించిన నేతలు



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకులు

సాక్షి రాయచోటి/రాయచోటి/టౌన్: ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడంపై అన్నమయ్య జిల్లా రాయచోటిలో దళిత వర్గాలు గర్జించాయి. వైఎస్ జగన్ సర్కారు హయాంలో మంజూరై బ్రహ్మాండంగా రూపుదిద్దుకుంటున్న వైద్య కళాశాలలను.. పీపీపీ విధానంలోకి చేర్చి అన్యాయం చేశారంటూ దండెత్తారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇటీవలే మదనపల్లె మెడికల్ కళాశాల వద్ద ఆందోళనలు చేపట్టిన వైఎస్సార్‌సీపీ నేతలు.. ప్రభుత్వానికి కనువిప్పు కలగకపోవడంతో మరొకసారి ఆందోళన బాట పట్టారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు జిల్లా ఎస్సీసెల్ విభాగం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున దళిత వర్గాలు కదం తొక్కాయి. పేద ప్రజల నడ్డి విరిచేందుకే ప్రైవేటు వైపు మొగ్గు చూపారని.. ఈసారి జిల్లాలోని కళాశాలకు కేటాయించిన సీట్లను కూడా వెనక్కి పంపారంటూ సర్కార్‌పై నిరసనకారులు మండిపడ్డారు.

పీపీపీ విధానంపై నిరసన

రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడవాల్సిన మెడికల్ కళాశాలలను పబ్లిక్ ప్రైవేటు పార్టిసిపేషన్ (పీపీపీ) విధానానికి కూటమి సర్కారు తేవడంపై ఎస్సీ సెల్ నేతలు నిరసన వ్యక్తం చేశారు. అందుకు సంబంధించి మంగళవారం అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వైఎస్సార్‌సీపీ దళిత శ్రేణులతోపాటు పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ముందుగా వైఎస్సార్ కాంగ్రెస్ జిల్లా కార్యాలయం వద్ద పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ముందుకు కదిలారు. అక్కడి నుంచి ప్రధాన రహదారి మీదుగా నేతాజీ సర్కిల్, ఠాణా మీదుగా మాసాపేటకు చేరుకున్నారు. ఈ సందర్భంగా దళితులపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలు, అమరావతిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం పార్కును ప్రైవేటీకరణకు అప్పగించడం వంటి సమస్యలపై దళిత నాయకులు విశదీకరించారు.

అంబేడ్కర్ విగ్రహానికి వినతి

పార్టీ కార్యాలయం నుంచి మాసాపేటకు చేరుకుని అక్కడ ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ముందుగా పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడే నిలుచొని మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణతోపాటు కూటమి సర్కార్ నిరంకుశ వైఖరిపై నినాదాలతో హోరెత్తించారు. అనంతరం బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. దళిత నాయకులతోపాటు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని అన్యాయంపై అంబేడ్కర్‌కు వేదన వినిపించారు. 'వైద్య విద్య మా హక్కు, అమ్మకానికి కాదు, ప్రతి జిల్లాకు మెడికల్ కళాశాల ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించాలి, జగన్ కలలను కాపాడుకుందాం–పీపీపీ కుట్రలను అడ్డుకుందాం, వైద్య విద్యను కార్పొరేట్ లాభాలకే కాదు–ప్రజల సేవకే ఇవ్వాలి, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఒక్కటై పోరాడదాం' అనే నినాదాలతో హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ అధ్యక్షుడు కమలాకర్, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శులు చుక్కా అంజనప్ప, దండుగోపి, మారుతీ, హరి, రవీంద్ర, ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎల్లప్ప, నరేష్ కుమార్, మాజీ ఎంపీటీసీ సగినాల శివ శంకర్, లోకేష్, నాగసుబ్బయ్య, జయరామచంద్రయ్య, ప్రసాద్, నాగమణి, రెడ్డయ్య, రాజ్ కుమార్, అంకె ఆంజనేయులు, పెంచలయ్య, రాజన్న, గంగులయ్య, రెడ్డయ్య, అశోక్, రామ్మోహన్ తదితర ఎస్సీ నేతలు పాల్గొన్నారు.

పేదలకు వైద్య విద్య దూరం



మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేసి 17 మెడికల్ కళాశాలలు తీసుకొస్తే.. వాటిని కూటమి ప్రభుత్వం ప్రైవేట్ పరం చేయడానికి కుట్రలు చేస్తోంది. మెడికల్ కళాశాలలు ప్రైవేటు పరం అయితే పేద విద్యార్థులకు వైద్య విద్య దూరం అవుతుంది.

– లింగం లక్ష్మీకర్, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ, రైల్వేకోడూరు

వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపిద్దాం



రాబోయే ఎన్నికల్లో కూటమిని ఓడగొట్టి వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకొద్దాం. అప్పుడు ఈ 17 మెడికల్ కళాశాలలను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పరం చేసి పేద, బడుగు, బలహీన వర్గాలకు న్యాయం చేస్తారు.

– గుండ్లూరు జయరామ చంద్రయ్య, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి

క్లుప్తంగా

4న తలనీలాల వేలం

సిద్దవటం : మండల పరిధి వంతాటిపల్లి గ్రామ పంచాయతీ లంకమల అభయారణ్యంలో వెలసిన శ్రీ నిత్యపూజస్వామి దేవస్థానంలో కార్తీక మాసంలో భక్తులు సమర్పించే తలనీలాల సేకరణ హక్కుకు బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణాధికారి ఎ.శ్రీధర్ తెలిపారు. అక్టోబర్ 4న ఉదయం 11 గంటలకు సిద్దవటం శ్రీ రంగనాథస్వామి దేవాలయంలో దేవదాయ, ధర్మాదాయ శాఖ అధికారుల సమక్షంలో వేలంపాట నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. వేలంలో పాల్గొనదలచిన వారు లక్ష రూపాయలు డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు. పాట ముగిసిన వెంటనే హెచ్చు పాటదారుడు పూర్తి మొత్తం చెల్లించి రశీదు పొందాలని వివరించారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీ


రోడ్డు ప్రమాదంలో గాయపడిన విశ్వ

చిన్నమండెం : మండలంలోని దేవగుడిపల్లి ఆర్చి వద్ద సోమవారం అర్ధరాత్రి సమయంలో రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ముగ్గురికి గాయాలైనట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. దేవగుడిపల్లి కస్పాకు చెందిన నాగరాజు కుమారుడు విశ్వ చిన్నమండెం నుంచి దేవగుడిపల్లికి వస్తుండగా కడప–బెంగళూరు జాతీయ రహదారిపై దేవుడుపల్లి ఆర్చి వద్దకు వచ్చేసరికి చిన్నమండెం మండల కేంద్రంలోని అరబిక్‌వీధికి చెందిన సాదిక్, జాఫర్, శేషావలి రాయచోటి వైపు నుంచి వస్తూ విశ్వ ద్విచక్రవాహనాన్ని ఢీకొన్నారు. దీంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన విశ్వాను తిరుపతి ప్రైవేట్ ఆసుపత్రిలో చేరి్పంచగా శేషావలి, సాదిక్, జాఫర్ అతివేగంతో వచ్చి విశ్వను ఢీకొనట్టినట్లు బాధితుడి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మైనర్లకు బైక్‌లు ఇచ్చిన వారిపై కేసులు


తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఏఎస్పీ

రాజంపేట టౌన్ : మైనర్లకు బైక్‌లు ఇచ్చేవారిపై కేసులు నమోదు చేయనున్నట్లు ఏఎస్పీ మనోజ్ రామనాథ్ హెగ్డే హెచ్చరించారు. మైనర్ల డ్రైవింగ్‌పై డ్రోన్ సహాయంతో మంగళవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. బైక్‌లు నడిపే మైనర్లను గుర్తించి అర్బన్ పోలీస్ స్టేషన్‌లో వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ తల్లిదండ్రుల నిర్లక్ష్యం వల్లే మైనర్‌లు బైక్‌లు నడుపుతున్నారన్నారు. దీని వల్ల పెద్ద ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంటుందన్నారు. తల్లిదండ్రులు చిన్నపిల్లలకు ఎట్టిపరిస్థితుల్లో వాహనాలు ఇవ్వకూడదన్నారు. మైనర్లకు బైక్‌లు ఇస్తే చట్టపరంగా తల్లిదండ్రులకు శిక్ష పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ సీఐ బి.నాగార్జున, ఎస్ఐ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బస్సులో బంగారు నగలు చోరీ

ముద్దనూరు : స్థానిక పాత బస్టాండులో ఆర్టీసీ బస్సులో ఎక్కిన మహిళనుంచి నాలుగున్నర తులం బంగారు నగలు చోరీ అయ్యాయి. ఏఎస్ఐ రమేష్ సమాచారం మేరకు మంగళవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో మండలంలోని దేనేపల్లెకు చెందిన లక్ష్మీప్రసన్న అనే మహిళ తన బ్యాగులోని పర్సులో నల్లపూసల దండ, బంగారు హారం పెట్టుకుని పొట్లదుర్తి గ్రామానికి వెళ్లేందుకు తన ఇద్దరు చిన్న పిల్లలతో కలసి పాతబస్టాండులో ప్రొద్దుటూరు బస్సు ఎక్కింది. పాత బస్టాండు నుంచి 4 రోడ్ల కూడలికి వెళ్లిన తర్వాత టికెట్ కోసం పర్సులో వున్న ఆధార్‌కార్డు చూపించడానికి పర్సుకోసం చూడగా బ్యాగులో పర్సులేదని గుర్తించింది. పర్సు దొంగిలించినట్లు తెలుసుకుని వెంటనే బస్సులో నుంచి దిగింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

రహదారులపై రక్తపు మరకలు!

- జాతీయ రహదారులపై నిత్యం మృత్యు ఘంటికలు
- ఒక వైపు అతివేగం, మరో వైపు పొంచి ఉన్న ప్రమాదాలు
- రహదారులపై కనిపించని ప్రమాద సూచికలు
- వాహనదారులకు అవగాహన తప్పనిసరి
- ప్రమాదాల నివారణకు రవాణాశాఖ మంత్రి శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్

జాతీయ రహదారులు రక్తపు మరకలతో నిండిపోతున్నాయి. కారణాలు ఏవైనా నిత్యం వాహనదారులు ప్రమాదాలకు గురవుతూనే ఉన్నారు. ఒక వైపు అతివేగం, మరో వైపు పొంచి ఉన్న ప్రమాదాల వల్ల వాహనదారులు ప్రమాదాలకు గురై ఆయా కుటుంబాలలో విషాదాన్ని మిగులుస్తున్నారు. అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా ఇటీవల కాలంలో జరిగిన ఘోర ప్రమాదాలు వందలాది కుటుంబాలలో చీకటిని నింపాయి.


తరచూ ప్రమాదాలకు కారణమవుతున్న రాయచోటి రింగ్‌రోడ్డులోని వంతెన


ప్రమాదంలో మృతి చెందిన ముబారక్(ఫైల్)


ప్రమాదం జరిగిన తరువాత ఏర్పాటు చేసిన సూచిక బోర్డు

రాయచోటి అర్బన్ : జిల్లాలోని పలు జాతీయ రహదాలు రక్తంతో తడిసిపోతున్నాయి. ప్రతి రోజూ ఎక్కడో ఒక చోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఊహించని ప్రమాదాలలో ప్రాణాలు పోగొట్టుకుంటున్న ఆయా కుటుంబాలలో విషాద ఛాయలు అలుముకుంటున్నాయి.

పొంచి ఉన్న ప్రమాదాలు ...

జాతీయ రహదారులలో జరుగుతున్న రోడ్డు అభివృద్ధి పనుల వద్ద సరైన సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం వల్ల కూడా రాత్రి సమయంలో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రాయచోటి పట్టణ పరిధిలోని గాలివీడు రింగు రోడ్డు సర్కిల్ నుంచి వేంపల్లి రోడ్డు సర్కిల్ వరకు రింగురోడ్డు పనులు గత కొన్ని నెలలుగా జరుగుతున్నాయి. అయితే ఇదే రహదారిలో మాండవ్య నది ప్రవహిస్తుండటం వల్ల గతంలో నిర్మించిన రెండు వంతెనలు ఉన్నాయి. ప్రస్తుతం పెరిగిన రోడ్డు వెడల్పుకు అనుగుణంగా ఆయా వంతెనల వెడల్పు పెరగకపోవడం వల్ల అక్కడ ఇటీవల పలుమార్లు ద్విచక్రవాహనదారులు, కారు, ఆటోలో ప్రయాణిస్తున్న వారు ప్రమాదాలకు గురయ్యారు. సోమవారం రాత్రి పట్టణ పరిధిలోని గాలివీడు రింగురోడ్డు సర్కిల్ సమీపంలోని వంతెన వద్ద ద్విచక్రవాహనదారులు ప్రమాదానికి గురై లక్కిరెడ్డిపల్లె మండలం పాలెం చిన్నపోతులవాండ్లపల్లెకు చెందిన ముబారక్ అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా, రెడ్డిశేఖర్ అనే మరో యువకుడు తీవ్రంగా గాయపడి రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

ప్రమాదాల నివారణకు రవాణాశాఖ మంత్రి శాశ్వత పరిష్కారం చూపాలి..

ఇటీవల కాలంలో జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని ఇదే జిల్లాకు చెందిన రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి చొరవ తీసుకుని రోడ్డు ప్రమాదాల శాశ్వత నివారణకు చర్యలు తీసుకోవాలనే డిమాండ్ ప్రజల నుంచి వినిపిస్తోంది.

- ఇదే ఏడాది జూలైలో పుల్లంపేట మండలంలో జరిగిన మామిడి పండ్ల లారీ బోల్తా పడిన ప్రమాదంలో 9 మంది మృతి చెందగా, మరో 10 మంది గాయపడ్డారు.
- మే నెల 24వ తేదీన గువ్వలచెరువు ఘాట్ రోడ్డులో జరిగిన ఒకే ప్రమాదంలో మరో ఐదుగురు మృతి చెందిన విషయం తెలిసిందే.
- మే 30వ తేదీన కురబలకోట వద్ద జరిగిన కారు ప్రమాదంలో రాయచోటికి చెందిన మైనార్టీ యువకుడు మృతి చెందాడు.
- జూలై 11న సుండుపల్లి రోడ్డు మార్గంలో ఆటో, ద్విచక్రవాహన ప్రమాదంలో ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులు గాయపడ్డారు.
- ఆగస్టు 9వ తేదీన చిన్నమండెం మండల పరిధిలో ట్రాక్టర్ ప్రమాదంలో ఇద్దరు కూలీలు అక్కడికక్కడే మృతి చెందారు.

ఈ ప్రమాదాలకు అతి వేగం, రహదారుల్లో సూచిక బోర్డులు సరిగా ఏర్పాటు చేయకపోవడం కారణంగా తెలుస్తోంది. ఇప్పటికైనా రవాణాశాఖ మంత్రి చొరవ తీసుకుని ఉన్నతాధికారులతో సమీక్షలు జరిపి అతివేగం, రోడ్డు భద్రతా నియమాలపై వాహనదారులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు ఎక్కువగా వ్యక్తం అవుతున్నాయి. జాతీయ రహదారులతో పాటు ఇతర గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రహదారుల్లో కూడా తప్పనిసరిగా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి స్పీడ్ బ్రేకర్లతో పాటు , బోర్డులను ఏర్పాటు చేసి ప్రమాదాల బారి నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లింపు షెడ్యూల్ విడుదల

- అక్టోబర్ 10వ తేదీ తుది గడువు
- ఆలస్యమైతే అపరాధ రుసుం తప్పదు

కడప ఎడ్యుకేషన్ : ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి తొలి అడుగు పడింది. వచ్చే విద్యా సంవత్సరంలో నిర్వహించనున్న ఇంటర్ పరీక్షల ఫీజు చెల్లింపునకు సంబంధించిన షెడ్యూల్‌ను ఇంటర్ బోర్డు విడుదల చేసింది. అక్టోబర్ 10వ తేదీ పరీక్ష ఫీజు చెల్లింపునకు తుది గడువుగా నిర్ణయించారు. 2026 మార్చిలో జరగనున్న పరీక్షలకు సంబంధించి ఈనెల 15వ తేదీ నుంచి ఫీజు చెల్లింపునకు బోర్డు కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఎలాంటి అపరాధ రుసుం లేకుండా అక్టోబర్ 10వ తేదీ వరకు గడువు విధించారు. అక్టోబర్ 11వ తేదీ నుంచి 21వ తేదీ వరకు రూ. 1000 అపరాధ రుసుంతో చెల్లించే అవకాశం కల్పించారు. గడువులోపు పరీక్ష ఫీజు చెల్లించేందుకు విద్యార్థులు అప్రమత్తం కావాలని ఇంటర్‌బోర్డు అధికారులు సూచిస్తున్నారు.

పరీక్ష ఫీజుల చెల్లింపు వివరాలు ఇలా...

ఇంటర్ ఫస్టియర్, సెకెండియర్ జనరల్, ఒకేషనల్ విద్యార్థులు థియరీ పరీక్షల నిమిత్తం రూ. 600 చెల్లించాల్సి ఉంటుంది. జనరల్ కోర్సులు చదివే సెకండియర్ సైన్సు విద్యార్థులు ప్రాక్టికల్ కోసం రూ. 275 చెల్లించాలి. ఒకేషనల్ కోర్సు చదువుతూ బ్రిడ్జి కోర్సు చేసే విద్యార్థులు బ్రిడ్జి కోర్సు సబ్జెక్టులకు పరీక్ష రుసుంగా రూ. 165 చెల్లించాల్సి ఉంటుంది. సెకెండియర్ చదువుతూ ఫస్టియర్ సబ్జెక్టులు ఫెయిల్ అయిన విద్యార్థులుంటే మొదటి సంవత్సరం, రెండవ సంవత్సరం థియరీ పరీక్ష ఫీజు కలిపి రూ. 1200 చెల్లించాలి. ఒకేషనల్ కోర్సు చదువుతూ ఫస్టియర్, సెకెండియర్ ప్రాక్టికల్ రాసే విద్యార్థులు రెండేళ్లకు కలిపి రూ. 550 చెల్లించాల్సి ఉంటుంది. బ్రిడ్జి కోర్సు చదివే విద్యార్థులు రెండేళ్ల పరీక్ష ఫీజు కింద రూ. 330 చెల్లించాలని తెలిపారు.

ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

జిల్లా ఎస్పీ ధీరజ్ కనుబిల్లి



రాయచోటి : విజయదశమి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని జిల్లా ఎస్పీ ధీరజ్ కనుబిల్లి ప్రజలకు సూచించారు. మంగళవారం ఆయన విజయదశమి సందర్భంగా జిల్లా ప్రజలకు, ఉత్సవ నిర్వాహకులకు ప్రకటన ద్వారా ప్రత్యేక భద్రత సూచనలు జారీ చేశారు. ఉత్సవ ఊరేగింపుల సమయంలో శాంతియుతంగా, క్రమబద్ధంగా పాల్గొనాలన్నారు. తోపులాట, అల్లర్లు వంటి ప్రమాదకర చర్యలు చేయరాదన్నారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనబడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఊరేగింపు మార్గాలను ముందుగానే ప్రణాళికాబద్ధంగా సిద్ధం చేసి ప్రజలకు తెలియజేయాలని పేర్కొన్నారు. పోలీసు అధికారులతో సమన్వయం చేసుకొని అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. శబ్ద పరికరాలు అనుమతించిన స్థాయిలోనే వినియోగించాలన్నారు. మద్యపానం, కత్తులు, కర్రలు, ఇతర ప్రమాదకర వస్తువులు పూర్తిగా నిషేధమన్నారు. ప్రతి పట్టణ, గ్రామంలో ఊరేగింపు మార్గాలపై ప్రత్యేక పోలీసు పహారా ఉంటుందన్నారు. విజయ దశమి పండుగ మన సంస్కృతి, ఐక్యత, ఆనందానికి ప్రతీక అన్నారు. ఈ పండుగను అందరూ సురక్షితంగా, ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్పీ కోరారు.

మంత్రి మండిపల్లిని కలిసిన జిల్లా ఎస్పీ ధీరజ్ కనుబిల్లి


రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కలిసిన జిల్లా ఎస్పీ ధీరజ్ కనుబిల్లి

రాయచోటి టౌన్ : రాష్ట్ర రవాణా, క్రీడలు, యువజన శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని జిల్లా ఎస్పీ ధీరజ్ కనుబిల్లి మర్యాద పూర్వకంగా కలిశారు. మంగళవారం అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలోని స్టేట్ గెస్ట్ హౌస్‌లో ఆయనను కలసి జిల్లాలోని శాంతి భద్రతలు, రోడ్డు భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ, మైనర్ల డ్రైవింగ్ నియంత్రణ వంటి అంశాలపై చర్చించారు. అలాగే యువత క్రీడలపై మక్కువ పెంచుకొనేందుకు పోలీస్ శాఖ సహాయ సహకారాలు అందించాలని మంత్రి కోరారు. దీనిపై ఎస్పీ సానుకూలంగా స్పందించారు.

నేటి నుంచి రిజిస్టర్ పోస్టు రద్దు



కడప వైఎస్ఆర్ సర్కిల్ : దశాబ్దాలుగా పోస్టల్ శాఖలో సేవలందిస్తున్న రిజిస్టర్ పోస్ట్ రద్దవుతోంది. రిజిస్టర్ పోస్టును స్పీడు పోస్టులో విలీనం చేయడం ద్వారా ఈ విధానం రద్దు కానుంది. కొత్త విధానం అక్టోబర్ ఒకటవ తేదీ నుంచి దేశ వ్యాప్తంగా పోస్టల్ శాఖ అమలులోకి తీసుకు రానుంది. ఇకనుంచి స్పీడ్ పోస్ట్ పార్సిల్ సేవలు అందనున్నాయి. స్పీడ్ పోస్ట్ అనేది పోస్టల్ శాఖలో విస్తృత సేవలు అందిస్తోంది. కొత్తగా స్పీడ్ పోస్ట్‌లో ట్రాకింగ్ సిస్టం కూడా అందుబాటులోకి వచ్చింది. పార్సెల్ బుక్ చేసిన వ్యక్తికే కాకుండా దానిని అందుకోనున్న వ్యక్తి మొబైల్ ఫోన్‌కు పూర్తి సమాచారంతో కూడిన మెసేజ్ వస్తుంది. బుక్ పార్సిల్ ఎక్కడుంది. ఎప్పటికి అందుతుంది వంటి వివరాలు మొబైల్ ఫోన్‌లో చూసుకునే వెసులుబాటు కల్పించింది.

సరికొత్త టెక్నాలజీ దిశగా....

పోస్టల్ శాఖలో ఇప్పటివరకు అమలవుతున్న టెక్నాలజీ విధానాలకు స్వస్తి పలికి సరికొత్త సాంకేతిక ఆధునికతతో కూడిన ఏపీటీ 2.0 ద్వారా సేవలందిస్తోంది. జులై నెలకు ముందు పోస్టల్ శాఖ మొత్తం సేవలు కోర్ ఇంటిగ్రేటెడ్ సిస్టమ్, కోర్ బ్యాంకింగ్ సిస్టమ్ ద్వారా అందేవి. వీటినే అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో ఉన్న ఏపీటీ 2.0 అమలులోకి తెచ్చింది. అక్టోబర్ ఒకటో తేదీ నుంచి విలీనమైన స్పీడ్ పోస్ట్ ద్వారా సాంకేతిక సౌకర్యాలతో సేవలందించేందుకు కడప పోస్టల్ డివిజన్‌లో అన్ని ఏర్పాట్లు చేశారు.

రెడ్‌బుక్ రాజ్యాంగం ఎంతో కాలం సాగదు

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి


కేక్ కట్ చేస్తున్న ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి

రాజంపేట టౌన్ : రెడ్‌బుక్ రాజ్యాంగంతో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను అక్రమంగా అరెస్ట్ చేయించి సాగిస్తున్న కూటమి ప్రభుత్వం పాలన మరెంతో కాలం సాగదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి హెచ్చరించారు. ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి బెయిల్ రావడంతో మంగళవారం పట్టణంలోని ఆకేపాటి భవన్‌లో మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలతో తన ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెడ్‌బుక్ రాజ్యాంగంలో భాగమే మద్యం కేసు అని తెలిపారు. మిథున్‌రెడ్డి ఎక్సైజ్‌శాఖ మంత్రి కాదని, కనీసం ఆయన తండ్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కూడా ఎక్సైజ్‌శాఖ మంత్రి కాదన్నారు. అలాంటప్పుడు మిథున్‌రెడ్డికి మద్యంతో ఏం సంబంధం ఉంటుందని ఆకేపాటి ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత వచ్చిందని, అందువల్ల ప్రజల దృష్టి మరల్చేందుకు మద్యంలో అవినీతి జరిగిందంటూ అక్రమంగా కేసులు పెడుతున్నారని ఆరోపించారు. మిథున్‌రెడ్డిపై నమోదు చేసిన మద్యం అక్రమ కేసు సాక్ష్యాలు లేక వీగిపోవడం ఖాయమన్నారు. మిథున్‌రెడ్డిపై అక్రమంగా కేసు పెట్టి దాదాపు 72 రోజుల పాటు జైలులో ఉంచడం బాధాకరమన్నారు. తమ నాయకులపై కేసులు పెట్టే కొద్ది తమ పార్టీ కార్యకర్తలు జూలువిదిల్చిన సింహాల్లా పార్టీ కోసం పనిచేస్తారన్న విషయాన్ని కూటమి పార్టీ నాయకులు గుర్తించుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమంగా కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేయడం చంద్రబాబునాయుడు దిగజారుడు రాజకీయాలకు అద్దం పడుతోందన్నారు. ఇప్పటికైనా చంద్రబాబునాయుడు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమంగా కేసులు పెట్టడంపై చూపే శ్రద్ధ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంపై చూపాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రక్కాసి శ్రీవాణి, సుజాత, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు జెనుగు కృష్ణారావు యాదవ్, ఏపీఎస్‌ఆర్‌సీ మాజీ డైరెక్టర్ బీహెచ్.ఇలియాస్, వివిధ విభాగాల కన్వీనర్లు డీలర్ సుబ్బరామిరెడ్డి, పాపినేని విశ్వనాథ్‌రెడ్డి, డి.భాస్కర్‌రాజు, వడ్డే రమణ, ఖాజామొహిద్దీన్, నాగా శేఖర్‌రెడ్డి, కటారు శేఖర్‌రెడ్డి, జీవీ.సుబ్బరాజు, అబ్దుల్ మునాఫ్, రెడ్డిమాసి రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చెరువులో గుర్తు తెలియని మృతదేహం



పీలేరురూరల్ : చెరువులో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన సంఘటన మండలంలోని కాకులారంపల్లె పంచాయతీలో వెలుగు చూసింది. వివరాలిలా ఉన్నాయి. కాకులారంపల్లె పంచాయతీ చింతకొమ్మచెరువులో గుర్తు తెలియని యువకుడి మృతదేహం తేలాడుతూ ఉండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడు ఎవరైంది ఎలాంటి ఆధారాలు లేవని సీఐ యుగంధర్ తెలిపారు. మృతుని కుడి చేతిపై అమ్మ అని, మణికట్టుపై ఎస్‌బీఆర్ అనే అక్షరాలతో పచ్చబొట్టు ఉందని చెప్పారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 9440796944, 9440796745 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఎంపీ బెయిల్‌పై కువైట్‌లో సంబరాలు


కువైట్‌లో స్వీట్లు పంచి పెడుతున్న వైఎస్సార్‌సీపీ కువైట్ కమిటీ సభ్యులు

రాయచోటి : రాజంపేట పార్లమెంట్ సభ్యుడు పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డికి బెయిల్ మంజూరు కావడంతో కువైట్‌లో ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. కువైట్ మాలియా ప్రాంతంలో పార్టీ ఆఫీసు వద్ద గల్ఫ్ కో కన్వీనర్ ఆధ్వర్యంలో మిథున్‌రెడ్డి విడుదల సందర్భంగా మిఠాయిలు పంచిపెట్టినట్లు గల్ఫ్ కన్వీనర్ ముమ్మడి బాలిరెడ్డి, కోకన్వీనర్ గోవిందు నాగరాజు తెలిపారు. వారు మాట్లాడుతూ మూడు సార్లు ఎంపీగా గెలిచిన మిథున్‌రెడ్డిని కేవలం రాజకీయ కక్షతో అక్రమ కేసులో జైలుకు పంపించడం అన్యాయమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేకనే కూటమి ప్రభుత్వం ఇంతటి నీచమైన చర్యలకు పాల్పడిందన్నారు. గల్ఫ్ అడ్వైజర్ నాయిని మహేష్‌రెడ్డి, కువైట్ కోకన్వీనర్ మన్నూరు చంద్రశేఖర్‌రెడ్డి, గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడు షేక్ రహమతుల్లా, సీనియర్ నాయకులు పూలపుత్తూరు సురేష్‌కుమార్‌రెడ్డి, కమిటీ సభ్యులు అఫ్సర్‌ఆలీ, అబ్బాస్, కిషోర్, హనుమంతురెడ్డి, షంషుద్దీన్, షేక్ ముస్తఫా, షఫీ తదితరులు పాల్గొన్నారు.

డీటీసీ కావలెను!

- 9 నెలలుగా రవాణాశాఖ కార్యాలయంలో సీటు ఖాళీ
- ఇన్‌చార్జి డీటీసీలతో సరిపెడుతున్న అధికారులు
- సకాలంలో పనులు కాక సతమతమవుతున్న వాహనదారులు


జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్ కార్యాలయం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్ కార్యాలయంలో 9 నెలల నుంచి డీటీసీ సీటు ఖాళీగా ఉంది. గతంలో ఇక్కడ ఉన్న డీటీసీ చంద్రశేఖర్ రెడ్డి లైంగిక ఆరోపణలు ఎదుర్కోవడంతో ఆయనను ప్రభుత్వం సస్పెండ్ చేసి విచారణకు ఆదేశించింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు డీటీసీ సీటు ఖాళీగానే ఉంది.

ఇన్‌చార్జి డీటీసీలతో విధులు..

రవాణాశాఖ అధికారులు ఇతర జిల్లాల అధికారులను ఇన్‌చార్జిలుగా నియమించి వారితో విధులు నిర్వహింపజేస్తున్నారు. ఇప్పటికే మగ్గురు డీటీసీలు ఇక్కడ ఇన్‌చార్జిలుగా పని చేశారు. అన్నమయ్య జిల్లా డీటీసీ ప్రసాద్‌ను ఇన్‌చార్జిగా నియమించగా ఆయన నాలుగు నెలలు పని చేసి వెళ్లారు. తర్వాత చిత్తూరు డీటీసీ నిరంజన్ రెడ్డి మూడు నెలలు, అనంతరం ప్రస్తుతం అనంతపురం డీటీసీ వీర్రాజు ఇన్‌చార్జి డీటీసీగా వాహనదారులకు సేవలను అందిస్తున్నారు. ఆయన వారంలో బుధవారం, గురువారం మాత్రమే ఇక్కడ ఉంటూ కార్యకలాపాలను నడిపిస్తున్నారు. ఈ రెండు రోజులు మినహా మిగతా రోజుల్లో డీటీసీ లేకపోవడంతో వాహనదారులకు సకాలంలో సరైన సేవలు అందడం లేదు. దీంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రవాణాశాఖ కార్యాలయంలో అధికారుల కొరత ఉండటంతో ఉన్న సిబ్బందిపైనే భారం పడుతోంది. ఇతర ఏ శాఖలో అయినా అధికారి బదిలీ అయినా సస్పెండ్ అయినా వెంటనే వేరే అధికారిని నియమించే ప్రభుత్వం జిల్లా ఉప రవాణాశాఖ కార్యాలయానికి మాత్రం ఇంతవరకు రెగ్యులర్ డీటీసీని నియమించలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని వాహనదారులు కోరుతున్నారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

మదనపల్లె రూరల్ : పట్టణంలో పేకాట ఆడుతున్న ఐదుగురు జూదరులను అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ మహమ్మద్ రఫీ తెలిపారు. స్థానిక బుగ్గకాలువలో పేకాట స్థావరం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో సోమవారం రాత్రి సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. ఈ దాడిలో బుగ్గకాలువకు చెందిన ఐదుగురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి ఐదు సెల్‌ఫోన్‌లు, రూ.17,950 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ దాడిలో ఎస్ఐ అన్సర్‌బాషా, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారన్నారు.

కంచె ధ్వంసంపై డీఎస్పీకి ఫిర్యాదు

మదనపల్లె రూరల్ : భూమికి రక్షణగా వేసిన ఇనుప కంచెను ధ్వంసం చేసిన వ్యక్తులపై మంగళవారం డీఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు కలాడి మోహన్‌రెడ్డి, సునీతరెడ్డి తెలిపారు. కొత్తవారిపల్లె పంచాయతీ దుబ్బిగానిపల్లెకు సమీపంలో సర్వేనెంబర్.193–1లో తమకు చెందిన భూమికి చుట్టూ కంచె వేసి కలాడి ఎస్టేట్ బోర్డు ఏర్పాటు చేసి భద్రపరచుకున్నామన్నారు. అయితే, ఈనెల 27వతేదీ సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తులు పలుచోట్ల కంచెను ధ్వంసం చేయడంతో పాటు రాతికూసాలను విరిచేశారన్నారు. దీంతో కలాడి మోహన్‌రెడ్డి తరఫున మామ జయరాంరెడ్డి డీఎస్పీ కే.మహేంద్రను కలిసి ఫిర్యాదు చేశారు. ఆయన తాలూకా సీఐ కళావెంకటరమణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



దుబ్బిగానిపల్లె సమీపంలో కలాడి ఎస్టేట్ కంచెను ధ్వంసం చేసిన దుండగులు